

# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జూన్ 2012

సంపుటి : 18 **209** సంచిక : 6




# ద్వేషం మానుకోవోయ్! దేహం స్థిరం కాదోయ్! దేశాన్ని ప్రేమించవోయ్


కాలం ప్రవహించే మహా జీవవాహిని. అందు భూగోళం ఒక బురద నీటి బుడగ. ఈ అనంత తత్వాన్ని గ్రహించినవాడు బురదలో పుట్టిన పద్మం వోలె భాసిల్లవలెగానీ, స్వార్థసహిత హారతి కర్పూరంలా వెంటనే గుప్పున వెలిగి కొండెక్కరాదు.

ధార్మిక భారతీయ సామ్రాజ్య ప్రణాళికయైన ధర్మశాస్త్రంలో సత్యం, ధర్మం, క్షమ, త్యాగం, గుణశీలతల్ని గురించి చక్కగా తెలియబరిచారు. భారత రాజ్యాంగ ప్రణాళికలను వ్రాసేటప్పుడు జవహర్‌లాల్‌నెహ్రూ, బాబాసాహెబ్ అంబేద్కర్, మౌలానా ఆజాద్ వంటి వారు భిన్నత్వంలో గల ఏకత్వమనే భారతీయ సారాన్ని గ్రహించారు. ఉత్తమశీలం, అంకితభావం, దేశభక్తినే ప్రధానంగా తీసుకున్నారు. మానవుడు సాధించలేనిదేదీ లేదనే భావాన్ని ముందువారి చరిత్రల ద్వారా గ్రహించారు. ఈ మానవ సౌభాతృత్వ మహోదయం కోసమే అంబేద్కర్ బౌద్ధం స్వీకరించి, సత్యంగచ్ఛామి, ధర్మం గచ్ఛామి అను ధర్మసూత్రానికి బద్ధుడై ఎందరు ప్రేరణ చేస్తున్నా, క్రైస్తవ మత తీర్థాన్ని గ్రహించలేదు. తాను ముస్లిమైనా, తొలుత భారతీయుణ్ణే అంటూ భారతీయతకు కట్టుబడి ఉన్నందుననే మౌలానా ఆజాద్‌ను నెహ్రూ తన తొలి మంత్రివర్గంలో విద్యాశాఖా మంత్రిగా నియమించారు. రాజ్యాంగ రచనాకర్తల్లో ప్రాధాన్య వ్యక్తిగా అంబేద్కర్‌ను గుర్తించి గౌరవించడమే గాకుండా నెహ్రూ తన ప్రభుత్వంలో న్యాయశాఖామంత్రిగా చేసారు.

భారతదేశ గత వైభవాన్ని పునఃజ్వలింపచేసే బృహత్తర కృషిని చేసే నాయకత్వం కరువయింది. శాంతి సంపదను వర్ధిల్లచేసే నాయకులు సోదికి కూడా కనపడ్డంలేదు. రాష్ట్రానికి అసెంబ్లీ, దేశానికి పార్లమెంటూ పవిత్ర పాలనాలయాలనే విషయం రాజకీయ రుగ్మతలు కల నాయకులు గ్రహించడం లేదు. ఈ రెండింటిలోనూ ఎన్నికైన పాలకప్రతి పక్షములు పరస్పర శతృత్వ వైఖరిగల విరోధుల్లా వ్యవహరించడం, వాకౌట్లు చేయడం, పాలనను స్థంభింపచేయడం ఒక ప్రక్క చేస్తూ, మరొక వర్గం వారు, దేశాన్ని దోచుకుని తినడమే ధ్యేయంగా ఉండడం, తమ తమ వారసులే పదవుల్లో ఉండడం వీక్షిస్తుంటే, ఈ దేశం భవిష్యత్తు ఏమైపోతుందాననే సందేహం కలుగుతూంది. ఎన్నికైన లోకసభ సభ్యుడుగానీ, రాష్ట్రశాసనసభ సభ్యుడుగానీ ఎన్నికైన తరువాత, దేశానికిగానీ, రాష్ట్రానికి గానీ ప్రజలందరకూ ప్రాతినిధ్యం వహించే సభ్యునిగా ఉండాలి, పథకాలను సమర్థంగా, చిత్తశుద్ధితో అమలు చేసేట్టుండాలిగానీ, సమావేశ రోజుల్లో నిత్యమూ తగవులాడుకుంటూ సభా బహిష్కరణం చేయడం సమంజసం కాదు. అయ్యదేవర కాళేశ్వరరావు, బి.వి. సుబ్బారెడ్డి, బులుసు సాంబమూర్తి వంటి శాసనసభాధ్యక్షులు సభను న్యాయంగానూ, ప్రజాస్వామ్యపరంగానూ జరుపడంలో సామర్థ్యం చూపించారు.

వ్యక్తికన్నా, పార్టీ కన్నా దేశం గొప్పదనే విషయాన్ని నాయకులు మరిచిపోయారు. వారేదో నీతిమంతులన్నట్టు 'త్వం శుంఠ-త్వం శుంఠః' యని అంతస్తులను మరిచిపోయే స్థితికి దిగజారిపోయారు.

దేశ భవిష్యత్తు యువతరంపై ఉన్నదని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే భావన నాయకుల్లో లేకపోగా వారిని పెడదారి పట్టిస్తున్నారు. ఉన్న స్వల్ప దేశ వనరుల విచ్ఛిత్తికి వారిని చీకటి గోళంలోనికి తోస్తున్నారు. వారిలో ఓ మహాత్మాగాంధీయో, రాజేంద్రప్రసాదో, పండిత గోవిందవల్లభపంతో, అంబేద్కర్, మౌలానా అజాద్, పుచ్చలపల్లి సుందరయ్య, డి.సంజీవయ్య వంటి నాయకులు, గుల్జారీలాల్ నందా, లాల్‌బహదూర్‌శాస్త్రి, నేతాజీ, అల్లూరి సీతారామరాజు, ప్రకాశం పంతులు, బులుసు సాంబమూర్తి వంటి దేశభక్తిగల నాయకులు వస్తారనే ఆశ అడుగంటిపోతున్నది. అలాటి స్ఫూర్తివంతమైన, దేశభక్తిగల నాయకులు వస్తారా అన్నది సంశయాత్మకమవుతూంది. ఇలాటి శుభపరిమాణం రావాలంటే, దేశాన్ని ఓ కొత్త రాజకీయ నాయకత్వం, సమున్నత దార్శనికతలో, వ్యక్తికన్నా దేశం గొప్పదనే భావన కల్పించే విధంగా యువమేధావులను ప్రజ్వలింపచేయాలి. వంద కోట్లమంది భారతీయులున్నారనే భావన కన్నా వంద కోట్ల మందినీ ఒకే శక్తిగా, ఒకే భారతీయ స్వాభావికులుగా మార్చే మంచి రోజు రావాలి. అదిప్పటి నాయకశ్రేణితో జరగని కార్యం. అందుకే అందర్నీ ద్వేషం మానుకోవోయ్, దేహం స్థిరం కాదోయ్! దేశం సుస్థిరతకు నడుము కట్టవోయ్ అని అభ్యర్థిస్తున్నా!



అసూయాద్వేషాలు, అహంకార అజ్ఞానాలు మదమాత్సర్యాలు కల కలుపు మొక్కలను ఏరిపారేయండి! దేశాభిమానం నాకు కద్దని వొట్టి గొప్పలు చెప్పుకోకోయ్. పూని ఏదైనా ఒక మేల్ కూర్చి జనులకు చూప వోయ్' అన్న మహాకవి గురజాడ పదాల్ను నెమరు వేసుకొందాం.

బుధజన విధేయుడు

*గోటేటి శ్రీరామారావు*


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# ఋష్య శృంగేరి వైభవం



(గత సంచిక తరువాయి)

ఈ విధముగా ఆరు శతాబ్దముల కాలము ఈ దివ్య మహా పురుషుల సంస్మృతిని చైతన్యవంతము చేసినది. మహర్షులకు మహాత్ములకు రాజపురుషులింతకన్న ఘనమైన సంకీర్తనా గౌరవము నెరపుట ఎచ్చటనైనా జరుగునా?

శ్లో॥ విద్యాతీర్థాంజనితమతి శుభే భారతీ తీర్థ పద్మే
నిత్యం కృత్వాద్వయ చిదమృతానంద సౌరభ్యమాజి
విద్యారణ్యద్రుమణి మహిమప్రాప్త లక్ష్మీవిలాసో
భూయో భూయో విహరతి సుఖీ బుక్కభూపాలహంసః

శ్రీ భారతీ తీర్థ పద్మము విద్యాతీర్థము నందు ప్రభవించినది. అద్వైత చిదమృతానంద సౌరభ్యము కలది. శ్రీ విద్యారణ్య సూర్యకిరణ మహిమ ప్రాప్త లక్ష్మీ విలాసము కలది. అట్టి పద్మము కడ బుక్క భూపాల హంసము విహరించుచున్నది.

కర్పూర ద్రవ శిఖార ప్రణయినః కల్హార మాలానిభా
చంద్రాలోక సహోదరాః పరిణత శ్రీవాగంధ పాణిందమాః
దుగ్ధాంభోధి తరంగ భంగ హృదోదీప్యంతునః శ్రేయసే
విద్యారణ్య గురోరద్దయా మృతముదః శ్రేష్ఠా కటాక్షాయరాః

శ్రీ విద్యారణ్యులవారి కటాక్షాంకురములు కర్పూర ద్రవ శిఖార ప్రణయవలె చంద్రలోక సహోదరముల వలె పరిణిత శ్రీగంధ పాణిందమమువలె దుగ్ధాంభోధి తరంగ భంగి సహోదరమువలె ప్రకాశించుచున్నవి. అవి మీకు సహశ్రేయస్సును సమకూర్చును.

కొం బ్రహ్మేన చతుర్ముఖః కిము హరిర్దోర్ణో ర్న చాప్రే అతం
కింవా శంభు రసౌన దృష్టి విషయమే వైషమ్యమాలాక్ష్యతే
ఐత్యా లోచ్య చిరం వనిశ్చితధియః పశ్చాద్విపశ్చిద్గణాః
విద్యారణ్యగురుం ఇమప్యదయవిజ్యోతిః పరం మన్యతే ॥

శ్రీ విద్యారణ్యులు బ్రహ్మయా? చతుర్ముఖములు కనిపించుటలేదే? ఆయన విష్ణువా? చతుర్బాహువులు లేవే? శంభువా? విషమనేత్రము లేదే? ఇట్లు బహుకాలము వివదించి విద్వాంసులు శ్రీ విద్యారణ్యులు కేవలము పరంజోయతియని తీర్మానించిరి.

శ్రీ శారదాదేవి ఆలయములో రాతిపై చెక్కిన శ్రీ చక్రము మీద శ్రీ ఆదిశంకరులు గంధపు చెక్కతో తయారుచేసిన శ్రీశ్రీశారదా విగ్రహమును శ్రీవిద్యారణ్యులు సువర్ణ విగ్రహములుగా ప్రతిష్ఠించిరి. ఈ విగ్రహము చుట్టు చక్కని శ్రీ శారదా దేవాలయము పెరిగినది. ఇక ఆ కాలమున నిర్మింపబడిన దేవాలయములన్నింటిలో మిక్కిలి మహత్తరమగు శ్రీ విద్యాశంకర దేవాలయ నిర్మాణము శ్రీశ్రీ భారతీకృష్ణతీర్థులు శ్రీశ్రీవిద్యారణ్యుల కృపా కటాక్షమే. ఇవిగాక శ్రీ జనార్దన దేవాలయము, శ్రీ భారతీ రామనాథ దేవాలయము శ్రీవిద్యా విశ్వేశ్వరాలయము, శ్రీ గోపినాథ మందిరము, పెక్కుచోట్ల శివలింగ ప్రతిష్ఠలు, శ్రీచక్ర ప్రతిష్ఠలు జరిగినవి. శ్రీహరిహర చక్రవర్తు, శ్రీవిద్యారణ్యుల పేరుమీదుగా విద్యారణ్య పుర అగ్రహారమును, హరిహరపుర అగ్రహారము మొదలగు అగ్రహారములు వెలసినవి. శ్రీశ్రీ శృంగేరి మఠ మహా సంస్థానము ప్రారంభమైనది. విద్వత్ బ్రాహ్మణ పోషణ, సమస్త దేవాలయములందు నిత్యధూపదీప నైవేద్యాదులతో పోషింపబడుట, శిష్య, శ్రోత్రియు, సోమయాజి పరివారముల పోషణ వంటి అనేక సత్కార్యములు ప్రారంభింపబడి, మఠ రాబడి ఆదాయములను సద్వినియోగపర్చబడెను.

శృంగేరీ మహాసామ్రాజ్యము చిహ్నస్వరూపము దాల్చెను
శ్రీ వ్యాఖ్యాన సింహాసనకు నూతన శోభ పరిడవిల్లెను
శ్రీ భారతదేశ చరిత్రలో సమున్నతమైన శ్రీ శారదాపీఠ
మహాసామ్రాజ్యము సువర్ణాక్షరములతో వెలసెను.

– శ్రీ శారదాంబాయై నమః శుభమస్తు –

చి॥ భమిడిపాటి వేంకటరామకృష్ణ చంద్రశేఖర శ్రీనివాస్ శ్రీ భమిడిపాటి సాంబమూర్తి గారి కుమారుడు, విశాఖపట్టణం

## మీలో ఉన్న మంచివాడొచ్చి వాడి తాట వొలచండి!

సిద్ధార్థుడలా వెడుతున్నాడు. అది వైశాలి వంటి మహారాచ నగరం. ప్రతీ వీధీ పెద్ద పెద్ద మేడలూ, మిద్దెలతోనూ నిండి ఉన్నది. అలాంటి ఆ నగరంలోని నాలుగు రోడ్ల కూడలిలో మధ్యగా గోళాకారంగా ఉండే గచ్చు దిమ్మ ఉన్నది. ఆ దిమ్మపై పెద్ద తలపాగా, బుగ్గమీసాలు, మల్లెపువ్వులా తెల్లగా ధగధగా మెరిసిపోయే ధవళ దుస్తులున్న ఆసామీ ఉన్నాడు. ఆ ఊరి పెద్దే కావచ్చు. రోడ్డు మధ్య వృత్తాకారంగా గీసిన స్థలంలో ఓ వృద్ధుడూ, ఓ వృద్ధురాలూ, ఓ బాలికా రక్తసిక్తమైన వస్త్రాలతో, బక్కచిక్కి ఉన్నారు. నరనరాల్లోని రక్తమూ, ఒంటిలోనున్న నీరూ ఆ నాలుగు రోడ్ల కూడలిలో కలిసిపోయిందనుకుంటాను. ఎందుకట్లైగా ఉన్న ఎముకలగూడే వారిలో కనిపిస్తుంది.

'ఎందుకు ఆగిపోయారు? ఆ ఎముకలు పొడయ్యేవరకూ కొట్టండి' అంటూ ఆ పెద్దాయన, ఆ పెద్దాయనకు వంతపాడే మరో నలుగురు పెద్దలూ ఒకరి వెంబడి మరొకరు అరుస్తూ రాళ్ళతో కొడుతున్నారు.

ఆ సిద్ధుడు ఆ ఘోరం చూచి, ఎందుకు నాయనా ఆ అర్భకుల్ని అలా కొట్టి చంపుతున్నారు – అని ప్రశ్నించాడు. ఒక్కొక్కరే గళం విప్పి వీళ్ళనీ ఊరినుంచీ తరిమైనా తరమాలి. రక్తసిక్త దేహమంతా బీడై భయంకరంగా చావాలి. ఈ ముసిలాడు దొంగ, పరుల సొమ్మును పంచదారలా మింగేస్తాడు. ఈ ఆడది పడుపు వృత్తితో ఊరివారందర్నీ చేరిపేస్తుంది. ఈ పిల్ల ఇప్పుడే దొంగతనం, లంజతనంలో ఆరిందా అయింది. ఇలా అయితే మా పిల్లలు చెడిపోతారు – అంటూ రెండుచేతులా పెద్దరాళ్ళు తీసుకున్నారు. అది చూచి సిద్ధుడు – అందరూ ఎందుకు ఎవరో ఒకరు నా కమండలంతో ఓ దెబ్బ వేయండి. వారి పీడ వీరగడైపోతుంది. అయితే ఒకటి గుర్తుంచుకోండి. మీలో ఏ పాపమూ చేయనివాడే ఆ పని చేయాలి. లేనిచో ఈ కమండలం మిమ్మల్ని పదింతలు కఠినంగా కొడుతుంది' అని ఎదుట ఉన్నవాళ్ళని పిలిచి కమండలం యిచ్చాడు. ఎవరికి వారు కమండలం తీసుకోవడానికి భయపడ్డారు. ఏం నాయనా కొట్టడానికి భయపడుతున్నారే. ఇంతకూ మీరెవరు? అని అడిగారు. మేము రాజకీయ నాయకులమన్నారు. అయితే వద్దు నాయనా! ఈ కమండలం పవిత్రత పోతుందన్నాడు సిద్ధుడు.

**ప్రముఖాంధ్రలో అక్షర తప్పులు ఎక్కువగా వస్తున్నాయ్!
తగిన జాగ్రత్తలు తీసుకొనే ప్రయత్నం చేస్తున్నాం.**


# కందుకూరి కలమే గాండీవమ్! కోటిలింగాల ఏకైక రూపమే వీరేశలింగం!

## వెరశి కందుకూరి వీరేశలింగం

# ఇటువంటి సంస్కరణాభిలాషి తిరిగి పుట్టలేదు

రాజమండ్రిలో కోటిలింగాల పుణ్యాన గోదావరి కెరటమై పుట్టాడు. ఘట్టివాడైన ఈ గాండీవధారిని నీలవేణి బంగాళాఖాతమ్మ తనలో (చెన్నయ్) తల్లి కలిపేసుకొన్నది.

పురాణములు చెప్పినవి ఒక రాముడినే, ఒక కృష్ణుడినే, ఒక పరశురాముణ్ణే, దేశచరిత్రలు చెప్పినవి ఒక శంకరాచార్యుడు, ఒక రామానుజుడు ఒక మధ్వుడు, గౌతమ బుద్ధుడు, ఒక రామకృష్ణ పరమహంస, ఒక వివేకానందుడు, ఒక కట్ట బ్రహ్మన్న, ఒక బసవేశ్వరుడు, ఒక అల్లూరి సీతారామరాజు, ఒక సుభాష్ చంద్రబోస్, ఒక మహాత్మా గాంధీ, ఒక ప్రకాశం పంతులినే! వారికి సములుగాను, వారి స్థానములు భర్తీ చేయగల మహాత్ముల్ని గానీ పేర్కొనలేదు. పేర్కొనడానికి లేరు. నింగిలోని ఒకొక్క గ్రహం, ఒకొక్క ప్రత్యేకతకుదహరింపబడినట్లుగానే, 1848 సం॥ము ఏప్రిల్ 16 సప్త గోదావరీ తీరాన కందుకూరి వీరేశలింగం అంతటి మహత్తర సంస్కరణా ప్రియుడు, సారస్వత వరదుడు, విజ్ఞాన శాస్త్ర గ్రంధకర్త, వివేకవర్ధని, **సత్యవర్ధిని** ప్రయోజనకర పత్రికల సంపాదకుడు – ఇంకా చెప్పాలంటే శతాధిక గ్రంధకర్త, శతాధిక సంస్కరణకర్త, శతాధిక కవుల చరిత్రకర్త, ఉపాధ్యాయుడు, ఉదార స్వభావుడు, శాంత మూర్తి, సౌజన్యమూర్తి, ఇన్ని, మరిన్ని కార్యములను ఒక చేత్తో సాధించినవాడు మరొకడు ఇంతవరకూ పుట్టలేదు. ఈ సంస్కరణములన్నీ చేపట్టిన కవి, పండితుడు, రచయిత గ్రంధకర్త, పత్రికా రచయిత బాల్య వివాహాలను నిరోధించి, మూఢనమ్మకాలకు ముడుపులు కట్టి, స్త్రీ విద్యను, వితంతు పునర్వివాహాలను జరిపించడం, సమాజంలోని కుళ్ళును, అజ్ఞానాన్ని ఎత్తి చూపుతూ, రకరకాల గుడ్డి నమ్మకాలను, అస్పృశ్యతల నరికట్టిన, ఒకరి అమాయకతకు మరొకరు ఎరకాకుండా, బలిగాకుండా కవచంగా ఉంటూ కళ్ళు తెరిపించిన ఒకేఒక సంస్కారి కందుకూరి. ఏ తమిళుల్లోనో ఈయన పుట్టిఉంటే కన్యాకుమారి వద్ద కడలిలోని పెనుశిలపై నిలువెత్తు శిలావిగ్రహాన్ని ప్రతిష్టించేవారు. ఆ రోజు ఎన్టీ రామారావుకు ఎవరైనా చెప్పి ఉంటే హుస్సేన్ సాగర్ మధ్య కందు కూరి శిలావిగ్రహ మండపం కట్టేవారు.



ఈ నాటికీ ఆయన సంస్కరణలు నూతన తేజాలను వెదజల్లుతున్నాయ్. బుద్ధిలేని ప్రజలు ఊరికొక విగ్రహాన్ని ఆయన తలవర్రకైనా పెట్టి వుంటే తలకలిగి ఉన్నవారమనే తలపైనా కలిగేది. సాంప్రదాయం అంటూ పాతదనాన్ని సమాజం త్యజించదు, కొత్తదనాన్ని అనుసరించనీయదు. గుర్రంమీద దౌడుతీస్తూ రెండు కత్తులు పట్టి పోరాడాలి. సమాజంపై ఒత్తిడి తేవాలి. కొందరి మనసులకైనా ఆయన చేస్తున్నది సరియైనదని తోచాలి. అందరూ శోత్రియులుగా ఉన్న ఆ రోజుల్లో, ఏ కొందరిబలిమీ లేకుండా, నరనరాల్లో వ్యాపించి పోయిన బాల్యవివాహాల్ని నిలుపు చేయడం, సమాజామోదంలేని వితంతు వివాహాల్ని జరిపించడం, ఆడపిల్లలను పాఠశాలకు పంపడంవంటి 'ఔరా' ఎవరు తలచని కార్యాలు, అందునా బ్రాహ్మణకులమున పుట్టి, అధ్యాపక వృత్తి చేస్తూ, చేపలా కనురెప్ప మూయకుండా – ఆ చాందసపు రోజుల్లో చేయడమనేది ఒక 'సంస్కరణం' కానేకాదు. రాక్షసకృత్యం యని శ్రోత్రియులు తిరగబడ్డారు. యాగశాల మీద పడకుండా రామ లక్షణులిరువురూ కలసి విశ్వామిత్ర యాగశాలపై శస్త్ర వలయం నిర్మించడమంతటి దుర్భేద్యకార్యం, దృఢ నిశ్చయంతో సాగించారు.

నిజానికిదో భగీరథ ప్రయత్నం. ఆకాశమున ఉవ్వెత్తు నుండీ శివుని రఘటూరఘూటమునుండి దోశడు నీళ్లయినా బీరు పోకుండా భువిమీదకు తీసుకుని రావడంకన్నా దుస్సరమైనది. ఇలా ఒకటా రెండా వీరేశలింగంగారు తన జీవిత కాలంలో ఓ అర్ధశతం వితంతు వివాహాలు చేయించారు. అందునా తన ఇంట తన సహచరిణి రాజ్యలక్ష్మమ్మగారి సహకారంతో! సామాన్యమా! అలాంటి దంపతులు ఆ రోజుల్లోనూ లేరు, ఈ రోజునా లేరు. ఇక్కడ కొంత వారి దాంపత్యమును చెప్పుకోవాల్సిన అవసరం ఉన్నది.

వీరేశలింగంగారు ఎప్పుడూ తండ్రివద్ద ఉండేవాడు కాడు. ఎప్పుడూ ఆయనకు బాబాయ్ తోడే. బాబాయి క్షణం కనపడక పోతే చికాకుపడిపోయేవాడు. భగవంతుని లీల ఏఁవిటో ఎరుగం. కానీ ముందే ఆయన మనిషిని స్థిరం చేసి కూర్చోబెడతాడు. అలాటి ఆయన నాలుగేండ్ల వయసుకు నాన్న పోయారన్నారు. నాన్న శవాన్ని కూడా చూపించలేదు. కర్మజరిగే పదిరోజులూ

**తెలుగు జాతి గర్వించతగ్గ, సత్యశీలం గల వ్యక్తి సామాజిక, సాంఘిక మూఢాచారాలపై నిరంతర యుద్ధం చేసి, నిర్మూలింపచేసారు. లంచం యివ్వాల్సి వస్తుందని ప్రభుత్వోద్యోగాన్నీ, అసత్యాలు పలుకాలని న్యాయవాద వృత్తినీ నిరసించారు. బ్రహ్మసమాజం ఆంధ్ర శాఖను ప్రారంభించింది వీరేశలింగంగారే! యువజన సంఘాల్ను కూడా వీరే ప్రారంభించారు. స్త్రీల కోసం సతీహిత బోధిని ప్రారంభించారు. హితకారిణీ సమాజం ద్వారా స్వంత డబ్బుతో సేవలు చేసారు. కవి, పండితుడు, అధ్యాపకుడు, రచయిత, పత్రికా రచయిత, ముద్రాపకుడు. 'రాజశేఖర చరిత్ర' యనే తొలి తెలుగు నవల వ్రాసిన రచయిత వీరే!**

వీరేశలింగం గారిని బంధువుల ఇంటికి పంపేరు. తిరిగి ఇంటికి తీసుకొని వచ్చినప్పుడు ఇంటిలోని వారందరూ ఏడుస్తున్నారు. ఎందుకేడుస్తున్నారని అడిగారు. 'నాన్న పోయారు' అన్నారు వాళ్ళు. వీరేశలింగం పిన్నవయసు అమాయకతను చూడండి. ఎక్కడికి పోయారు? ఎప్పుడు వస్తారు? అని అడిగితే సమాధానం లేదు. బాబాయ్ వీరేశలింగాన్ని భుజాన వేసుకొని బయటకు తీసుకొని వెళ్ళాడు. రెండు చేతులూ నిండేట్టు తినుబండారాలు కొనిచ్చాడు. ఇప్పుడెందుకు బాబాయ్ అన్నాడు. అనీఅనడంతోనే నౌకరు ఎత్తుకొని తీసుకొని వెళ్ళిపోయాడు. అక్కడితో ఆ సంఘటనకు పూర్తి విరామం చిక్కింది.

వీరేశలింగానివన్నీ తెలివైన ప్రశ్నలు. చెప్పే సమాధానాలు అన్నీ డాష్ డాష్ డాష్లే! వీరేశం పిన్న వయస్కుడైనా అనేక పెద్ద ప్రశ్నలు వేసేవాడు. తెలుసుకోవాలన్న జిజ్ఞాస, మనస్సుకు పదునుపెట్టే ఆలోచనలు

వారిది లంకంత ఇల్లు. మంచి సందడిగల కుటుంబం. టేబిల్ ఫాన్ క్రింద చిన్న బల్ల. దాని ప్రక్క కూర్చోవడానికి ఒక కుర్చీ. ఇవేవీ ఆయనకు ఘనంగా ఉండేవికావు.

1. పిల్లలకు చిన్నవయసులోనే పెళ్ళిళ్ళు చేస్తారెందుకు?


ఆడ పిల్లల్ని బడికి వెళ్ళనివ్వరెందుకు. అసలు గుమ్మం బయటకు అడుగు పెట్టనివ్వరెందుకు? ఆడ పిల్లలకు చిన్నవయసులో భర్తలు చనిపోతే పెళ్ళిళ్ళు చేయరెందుకు? పూలు, బొట్టు, గాజులూ తీసేస్తారెందుకు?

లంచం ఇవ్వకుండా ఉద్యోగం రాదెందుకు? అబద్ధాలాడతారెందుకు? అవినీతిఎందుకు? కులాల అడ్డుగోడలెందుకు

కళ్ళముందే నచ్చని విషయాలు జరుగుతుంటే ఎవరూ అడ్డుకోరెందుకు?

ఐదేళ్ళ వరకూ ఏంవీ తెలియని తనం? పదేళ్ళ తరువాత ఏదో అన్యాయం జరిగిపోతుంది. తెలుసుకోవాలన్న జిజ్ఞాస. ఏంవిటో ఈ సమస్యలు. వీటికి పరిష్కారమేలేదా? ఏంచేసి వీళ్ళను కాపాడాలి.

## వివేక వర్ధిని



ఉన్నత విద్యానంతరం వీరేశలింగం అధ్యాపక వృత్తిని చేపట్టారు. రాజమండ్రి, కోరంగి, ధవళేశ్వరం, మద్రాసులలోని పాఠశాలల్లో పనిచేసారు. అధ్యాపకుడిగా పనిచేస్తుండడంతో 'పంతులు'గారని, వీరేశలింగం పంతులుగారని ప్రాచుర్యం పొందారు.

సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి 1876లో ఉపాధ్యాయ వృత్తి నుండి జర్నలిస్టుగా మారి 'వివేకవర్ధని' అనే మాసపత్రికను ప్రారంభించారు.

మొదట ఈ పత్రిక మద్రాసు నుండి వచ్చేది. తర్వాత కొంతమంది స్నేహితులతో కలసి – రాజమండ్రిలోనే సొంత ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుచేసుకుని అక్కడినుంచి పత్రికను నిర్వహించారు.

ఆరోజుల్లోనే లంచగొండితనం, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు... ఇలా ఎన్నో అన్యాయాలు సమాజంలో జరుగుతుండేవి. వాటిపైకి తన పత్రిక 'వివేకవర్ధని'ని ఆయన ఎక్కుపెట్టారు.

మనవాళ్లు పూర్వాచార పరాయణులగుట చేత నీతిబాహ్యమైన గూఢ వ్యభిచారమునైన నంగీకరింతురుగాని, యాచార విరుద్ధమైన ధర్మవివాహము నంగీకరిపరు' అని వీరేశలింగం ఏమాత్రం మొహమాటం లేకుండా, మర్యాద లేకుండా సభల్లో ఉపన్యసించడం పెద్దపెద్దవాళ్లకు ఆగ్రహం తెప్పించింది. భువనగిరి పరదేశీ సోమయాజులు, శ్రౌతము కోటీశ్వరశాస్త్రులుగారు, కొక్కొండ వేంకటరత్నం పంతులు, ఓగిరాల జగన్నాథం, వేంకటరాయ శాస్త్రులు, దంతులూరి నారాయణ గజపతిరావు, దాసు శ్రీరాములు వంటి మహామహులు వీరేశలింగంపై విరుచుకుపడ్డారు.

తిరువూరు తాలూకా రేపూడి గ్రామంలో గౌరవమ్మ అనే పన్నెండేళ్ల బాల వితంతువు ఉన్నదనీ, ఆమెకు మళ్లీ పెళ్లి చేసేందుకు ఆమె తల్లి సీతమ్మ సిద్ధంగా ఉన్నారని ఉత్తరం రాగా 'మీదే ఆలస్యం' అని పంతులుగారు తక్షణం రిప్లయ్ ఇచ్చారు. అమ్మాయిని భద్రంగా రాజమహేంద్రవరం రప్పించి, తన ఇంట్లో, తన భార్య సంరక్షణలో ఉంచారు. ఆ వెంటనే వరుడి వేట మొదలైంది!

విశాఖపట్నం పోలీస్ హెడ్ క్వార్టర్స్లో పనిచేస్తున్న గోగులపాటి శ్రీరాములు అనే యువకుడు ఆ క్షణంలో పంతులుగారి మదిలో మెదిలారు. గతంలో అతడు పంతులుగారి ఇంట్లోనే ఉండి చదువుకున్నాడు. అతడికి కబురు పంపారు. శ్రీరాములు గౌరమ్మను చూడకుండానే పంతులుగారిపై ఉన్న గౌరవంతో పెళ్లికి ఒప్పుకున్నాడు.

శ్రీరాములుకు అంతకుముందే పెళ్లయింది. భార్య అకస్మాత్తుగా చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. ఆ ఒంటరితనాన్ని పోగొట్టేందుకు పిల్లనిస్తామని ఎంతోమంది వచ్చినా వితంతు వివాహం చేసుకోడానికే అతడు వేచి ఉన్నాడు. చివరికి గౌరమ్మ దొరికింది!

పెళ్లి పనులు రహస్యంగా జరుగుతున్నాయి. వరుడి పేరును కూడా పంతులు గారు రహస్యంగా ఉంచారు. గౌరమ్మ అనే బాల వితంతువుకు పంతులుగారింట్లో పెళ్ళి జరగబోతోందని ఊరంతటికీ తెలిసింది. కానీ వరుడెవరో బయటికి పొక్కలేదు. పెళ్ళికి కావలసిన రక్షణ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కర్నల్ దొరగారి నుంచి లభించింది. పెళ్లికి అవసరమైన డబ్బును పంతులుగారి స్నేహితుడు పైడా రామకృష్ణయ్యగారు సమకూర్చారు. వధూవరులకు కావలసిన నైతిక స్థయిర్యాన్ని పంతులుగారు ఇచ్చారు. అలా రాజమహేంద్రవరంలో మొట్టమొదటి వితంతు పునర్వివాహం జరిగింది.

ఆ వివాహానికి వెళ్లిన వారందరినీ సమాజం గుర్తుపెట్టుకుని మరీ వెలివేసింది. వేడుకలకు, వివాహాలకు పిలవడం మానేసింది. పంతులుగారిని చీడపురుగుగా చూసింది. వీరేశలింగం భయపడలేదు. నేనింతే అన్నాడు. ఇదొక్కటే కాదు ఇంకా చాలా పెళ్లిళ్లు చేస్తానని సవాల్ విసిరాడు.

"ఈ బక్క పీనుగకు చావైనా రాదే! వీడి మీది గౌరవంతో వీడి పెళ్లానికి ఇంకో పెళ్లి చేద్దుము" అని శుద్ధ సంప్రదాయవాదులు పంతులుగారిని రహస్యంగా తిట్టుకున్నారు. ఆ రహస్యం ఆయన చెవినపడి నవ్వుకున్నారేగానీ, నమ్మిన తోవను వదిలి వెళ్లలేదు.

వీరేశలింగం పంతులుగారు శారీరకంగా బలహీనులైతే కావచ్చు. మానసికంగా బలవంతులు. పైడా రామకృష్ణయ్య, ఆత్మూరి లక్ష్మీ నరసింహం, బసవరాజు గవర్రాజు వంటి మిత్రులు, విద్యార్థుల బలం, అన్నిటికన్నా పెద్ద బలం ఆయన అర్ధాంగి రాజ్యలక్ష్మి. కందుకూరి వీరేశలింగం రాజ్యలక్ష్మి వంటి దంపతులు పుట్టరు.

బడిలో ఐదో ఏట నేర్చుకొన్నవి బాలరామాయణం, ఆంధ్రనామ సంగ్రహం, అమరం, రుక్మిణీ కళ్యాణం, రుక్మిణీ శతకం. పన్నెండో ఏటనుంచీ అన్నీ ఇంగ్లీషు పాఠాలే, ఇంగ్లీషు సంభాషణలు సిలబస్తో బాటు కేశవ చంద్రసేన్ పుస్తకాలు, బెంగాలీ పుస్తకాలు అందు స్త్రీని స్థిమితంగా ఉంచని సమాజాన్ని ఏంచేసి కాపాడాలి. ఏ సంస్కరణలు చేబట్టాలి. వీరేశం భావనలనే చంద్రశేఖర్ పుస్తకాల్లో వ్రాసాడు. అవన్నీ చదువుతూంటే అంతుబట్టని ఆలోచనలు వీరేశలింగంలో మెదిలాయ్. అప్పుటికాయన వయసు పదేళ్ళే. అప్పుడే పంతులు గారు ఏ ఉద్యమం చేసినా, భార్య రాజ్యలక్ష్మమ్మ తోడుబాటు ఉండేది.

**1848** సం॥మునకు ముందూ 1919 సంవత్సరం అనంతరమూ, ఆయనకు 'సరిసముడు' దొరకలేదు. 1848 స॥ము గోదావరి ఏడు పాయలుగ చీలేచోట, కోటిలింగాల తీరంలో కోటి కోయిలలు 'తెలుగుహు, తెలుగుహు' అని మధుర రవళిలు కురియువేళ, ఎక్కడా ఏ అడ్డూ లేని నీలి గగనం కోట్లాది కాంతిపుంజాలను విరుస్తున్నవేళ, అఖండ గోదావరి క్షీరసాగరుని స్థావరమై, క్షీరసాగరశయనుని బొడ్డునుంచీ సృష్టికర్త బ్రహ్మ వెలసినట్టు, ఈ పరబ్రహ్మ కందుకూరి వీరేశలింగం పంతులు కందుకూరి సుబ్బారాయుడు, పున్నెమ్మల సంతానంగా వెలసి, 1851 సం॥లో రాజ్యలక్ష్మమ్మను సహధర్మచారిణిగా చేపట్టి, ఎవరికీ తట్టని, అంతుబట్టని వేదములవంటి విజ్ఞానశాస్త్ర గ్రంథములను తెలుగులోనికి అనువదించడమే గాకుండా తెలుగు కవుల చరిత్రలను ఔపోసన బట్టినట్లు గ్రంథరూపమిచ్చి, వివేకవర్ధిని, సత్యవర్ధిని అను రెండు ఆణిముత్యాలవంటి పత్రికల్ని నిర్వహించి, స్త్రీలలోని అవిద్యను రూపుమాపడం, బాల్యవివాహాలను నిరసించడం, తన యింట్లోనే వితంతువులకు తగిన వరుల్ని చూచి వివాహం చేయడంలో సహధర్మచారిని రాజ్యలక్ష్మమ్మ తోడెంతో ఉన్నది. వారే ఆదర్శ దంపతులు. వారు చేసిన మహత్కార్యాలను మరొక్కరు చేసారనే దాఖలాలు వారు చేయని సత్కార్యములు, సంస్కరణలు లేవు. కవిగ, రచయితగ, పత్రికా రచయితగ, గ్రంధకర్తగ, సంఘ సంస్కర్తగా ఆధ్యాపకునిగా పత్రికా రచయితగా పెక్కు భంగిమలుగా కృషిచేసిన కందుకూరి వంటి మహావ్యక్తి మరొకరు లేరు. ●

వీరేశలింగం-రాజ్యలక్ష్మి దంపతుల దాంపత్యం వెలుగూ నీడ వంటివి. పంతులు గారికపుడు 62 ఏండ్లు, రాజ్యలక్ష్మిగారికి 58 ఏళ్ళు. వీరేశలింగంగారికి వివాహం అయ్యేప్పటి వయస్సు 12 సం॥రాలే, రాజ్యలక్ష్మిగారికి ఎనిమిదేళ్ళ వయసే. ఇద్దరికీ నాలుగేండ్లే తేడా. ఇప్పుడాయనకు 62 ఏండ్లు, ఆమెకు 58 ఏండ్లూ. అంటే అర్థ శతాబ్ది కాలం పాటూ వారి అన్యోన్య దాంపత్యం కొనసాగుతూ వచ్చింది. అయితే ఎప్పుడూ ఓ అనాథ యువతి ఇంట్లో ఉంటూనే వస్తుంది.

రాజ్యలక్ష్మి – వీరేశలింగంగారి దాంపత్యం అపురూపం. ఊహలు తెలియని వయస్సులో వారి పెండ్లి జరిగి 50 యేండ్లు అవుతుంది. వీరేశలింగంగారి ఆధునిక భావాలను ఆమె ఏనాడూ ఎదురుకోలు చెప్పిందిలేదు. ఇంట్లో ఎందరున్నా ఆయన అవసరాలను తు.చ తప్పకుండా చేసేవారు! తెల్లవారి ఝామునే స్నానం చేసి , వంట చేసి సిద్ధంగా ఉంచేవారు. రెండు పూటలా అలాగే చేసేవారు. దగ్గరుండే వడ్డన చేసేవారు. ఆ రోజు పంతులుగారి ఇంట్లో ఆవు ఈనింది. పంతులుగారికి జున్నంటే ఎంతో ఇష్టం. రాజ్యలక్ష్మిగారు జున్ను చేసి వీరేశలింగం గారికి పెట్టారు. తక్కిన వాళ్ళకి పెట్టారు. తనూ తిన్నారు. పంతులు గారికి ఏవి ఇష్టమో ఆమెకూ అదే ఇష్టం. ఆ రోజు పంతులు గారిని చూడడానికి ఆయన స్నేహితుడు కనుపర్తి శ్రీరాములుగారు వస్తే ఆయనకూ జున్ను పెట్టారు. ఆయనతో చక్కగానూ, చలాకీగానూ మాట్లాడారు. పంతులుగారెప్పుడూ వంటరిగా భోజనం చేసేదిలేదు. భార్యా భర్తలు ఇరువురూ కలిసి కూర్చునే భోజనం చేసేవారు. ఆరోజూ అలాగే కలిసి కూర్చుని భోజనం చేస్తూ, నిన్న నీవు చేసిన జున్ను చాలా బావుంది సుమా అన్నారు. మరునాడు ఉదయం తానే పనులు చేయాలో రాజ్యలక్ష్మిగారు గుర్తు చేసుకొన్నారు. ప్రేమావతిని ఉదయమే డాక్టరుదగ్గరకు తీసుకు వెడుతున్నానని భర్తతో చెప్పారు. అన్నట్టు ప్రేమావతి ఎవరో మీకు చెప్పలేదుకదూ! ఓ బ్రాహ్మణ వితంతువు పంతులుగారింట్లో ఆ బిడ్డను విడిచిపెట్టి వెళ్ళి పోయింది. పంతులుగారు నడుపుతున్న పతితరక్షణ శాలలో ఉండేబిడ్డ ఆ ప్రేమావతి. రాజ్యలక్ష్మిగారే ఆ పిల్లను కంటికి రెప్పలా పెంచుతున్నారు.



రాజమండ్రిలోని వీరేశలింగం పంతులుగారి నివాసం



పంతులుగారింటి కింది అంతస్తు



పంతులుగారింటి మొదటి అంతస్తు

ఆ రోజు రాత్రి భోజనాలయ్యాయి. పంతులుగారు మేడమీద గదిలోకి శ్రమించడానికై వెళ్ళిపోయారు. రాజ్యలక్ష్మమ్మగారు పశువులకు మేతవేసి, తను తాంబూలం వేసుకుని, ఆమె మేడమీదకు వచ్చేసరికి రాత్రి పదయ్యింది. పడుకునేముందు చేసుకొనే ఈశ్వరప్రార్థన చేసుకొని, ఆమె వెళ్ళి తాను వసారాలో పడుకునే మంచంమీద పడుకున్నారు. అప్పటికి పంతులు గారు గాఢనిద్రలో ఉన్నారు. సాధారణంగా ఆయన ఎనిమిదిగంటలకు భోజనంచేసి తొమ్మిది గంటలకు పడుకొంటారు. అంత ఆలశ్యంగా పడుకొన్నప్పటికినీ రాజ్యలక్ష్మమ్మగారు వేకువజామున 4 గం॥అకు లేచి (కాలకృత్యములు అప్పటికే అయిపోతాయ్) భర్త ప్రక్కనున్న పడక కుర్చీలో కూర్చుని కష్టసుఖాలు కలబోసుకుని చెప్పుకుంటారు. తర్వాత ఈశ్వరప్రార్థనం చేసుకొని క్రిందికి వెళ్ళిపోతారు. ఆ రాత్రి పంతులుగారికెందుకో 3 గంటలకే మెలకువ వచ్చింది. తలుపుతీసుకొని మెల్లగా వసారాలోకి వెళ్ళారు. ఆయన వస్తున్న చప్పుడు కాగానే రాజ్యలక్ష్మిలేచి క్రిందకు వెడుతున్నారా దీపముందా, జాగ్రత్తగా చూసుకుని వెళ్ళండి అనేవారు. కానీ ఆరోజు ఆ పిలుపు వినిపించలేదు. పంతులు గారు ఆవిడ మంచం వద్దకు వెళ్ళి నిద్రపోతున్నావా అని మెల్లగా అడిగారు.


జవాబు లేదు. ఇంకా మెలకువ రాలేదేమోనని తన మంచంవద్దకు వెళ్ళి కొంతసేపు పడుకొన్నారు. గడియారం 4 గ॥లు కొట్టగానే పంతులుగారికి మెలకువ వచ్చింది. ఎప్పటిలా రాజ్యలక్ష్మిగారు ఆయన మంచంవద్దకు రావాలి. ఆయన ప్రక్క కూర్చోవాలి. ఆ వేళ అలా జరగలేదు. పంతులుగారే లేచి ఆవిడ మంచంవద్దకు వెళ్ళి 'మెలకువ రాలేదా?' అంటూ అడిగారు. రాత్రి బాగా పొద్దుపోయేవరకూ ఇల్లు సర్దుబాటులో ఉండి ఉంటుంది. అలసటగా ఉండి ఉంటుంది. లేపటం ఎందుకని – వెళ్ళి ఆయన ప్రక్కనే ఉన్న పడక కుర్చీలో కూర్చుని ఉన్నారు. మరల గోడ గడియారం 5 గం॥లు కొట్టింది. ఇదువరకూ ఆమె పడుకున్న దాఖలాలు లేవు. కోడికూతకు ముందుగానే లేచేవారు. మళ్ళీ దగ్గరకు వెళ్ళి పిలిచారు. ఆమె కదలలేదు. సమీపానికి వెళ్ళి చూశారు. ప్రక్క చెదరకుండా ఉంది. సిగలోని గులాబీ పువ్వు అప్పుడే పెట్టుకున్నట్టుగా ఉన్నది. పడుకోబోయే ముందు పంటిమధ్య వేసుకొన్న లవంగం మొగ్గ అలాగే ఉంది. చేయి వేసి చూసారు చల్లగా ఉన్నది. వైద్యుడు వచ్చాడు. అప్పటికే మూడు, నాలుగు గంటలముందు ప్రాణం పోయి ఉంటుందన్నాడు.

పంతులుగారు అవాక్కయ్యారు. భార్య ముఖంలోకి చూసారు. నిదురపోతు న్నట్టున్నది. ఈశ్వరా! అంటూ పంతులు గారు కుప్పలా కూలిపోయారు. ఆయన దుఃఖాన్ని ఉపశమింపచేస్తూ, ఒదివి పట్టుకునేవారు లేరు. అలాటి శక్తి అక్కడ ఎవ్వరికీ లేదు. ఆ రాజ్యలక్ష్మే బ్రతికివచ్చి ఆయన్ను ఒదివి పట్టుకోవాలి.

తండ్రిపోయినప్పుడు ఆయనకు నాలుగేళ్ళు. అప్పుడాయనకు స్ఫురణలేదు. అర్థశతాబ్దిపాటు నీడలా, ఓతల్లిలా, ఆయన అవసరాలెరింగిన గృహదేవతగా ఉన్న మనిషి కళ్ళెదుటనే కట్టెలా ఉండడంతో మనస్సు వికలమవుతుంది.

ఆయన జీవిత చరిత్రలో ఆయన చెప్పుకుంటారు. నాలుగుసంవత్సరాల ప్రాయం వచ్చువరకూ నేను చెప్పుకోవలసినదేదీ లేదు. తల్లీ, తండ్రీ తన ఊహలకందకుండా పోవడం రాజ్యలక్ష్మమ్మ ఎనిమిదవయేట, తన పన్నెండవ యేట ఎలా ప్రవేశించిందో జీవితం అలా అర్ధశతాబ్దికే అన్యోన్యత మొగ్గలు తొడిగి, పుష్పించి, సౌరభాలొసగి, సంతోషాభ్యున్నతిని ఏవిధంగా నడిపించినదీ ప్రవాహంలా ఏ సాగరతీరాలకు పోయిందే – అని అందరూ భిన్నులయ్యారు. ●

# అక్కినేని ఎక్కలేని మెట్లు లేవు!!



అనాడు 'సీతారామ జననం'లో కల్యాణరామునిగా తెరపై జన్మించి - 90వ పడిలో రామచరితమును వ్రాసిన వాల్మీకిలా నటించడం అక్కినేనికే చెల్లింది -

సీతారాముల కల్యాణము చూతము రారండీ! - యని ఘంటసాల బలరామయ్య పిలిస్తే రామజననం, సీతారామకళ్యాణము నందు నూనూగు మీసాల అక్కినేని నాగేశ్వరరావును శ్రీరామునిగా చూసాం. చిత్ర పరిశ్రమ రజితోత్సవాలు చేసుకున్న అనన్తరమ్ అక్కినేని నాగేశ్వరరావు తొంభై ఏళ్ళ పడిలో 'రామాయణము'నే రచించిన వాల్మీకిగా చూడకలిగినందుకు తెలుగు వాళ్ళెంతో అదృష్టవంతులు, తెలుగు చలనచిత్ర పరిశ్రమ అదృష్టవంతురాలు!

ఇప్పటికి 45, 50 ఏళ్ళ క్రితం గోటేటి శ్రీరామారావు వ్రాసిన 'పద్మశ్రీ అక్కినేని', 'అక్కినేని సువర్ణ గ్రంథము' పుస్తకాల్లోని 3వ పుటలో 'అక్కినేని ఎక్కలేని మెట్లు లేవు' అని మూడు ముత్యాల వంటి మాటలు వ్రాసినప్పుడు అక్కినేని అన్నపూర్ణ, ఆదుర్తి సుబ్బారావు, చిత్తూరు వి.నాగయ్య ఎంతగానో ప్రశంసించారు. చిత్తూరు వి. నాగయ్య గారైతే 'మధురవాణి' గోటేటి వారి నుంచీ మధురమైన మంచి మాటలే వస్తాయ్' అన్నారు. (అప్పుడు నేను 'మధురవాణి' పత్రికను నడుపుతున్నాను. 'మధుర వాగ్వాణి నిను గొల్తునే మధురవాణీ' యని పత్రిక సంపాదకీయ పేజీలో మకుటం పెట్టుకున్నాను. ఇప్పటికీ పి.బి. శ్రీనివాస్ వంటి నేపథ్య (వాగ్గేయకారులు) గాయక సామ్రాట్లు 'మధురవాణి' గారూ అని పిలుస్తూనే ఉంటారు. మంచిని పొగడడమే నా ధ్యేయం. ఎవరూ నన్ను వేలెత్తి విమర్శించలేదు. ధనికొండ హనుమంతరావుగారైతే ఇంత అమాయకుడు - పత్రిక పెట్టి ఎలా నెగ్గుకొని వస్తావయ్యా - అనేవారు. అక్కినేని గారికి గుర్తుందో లేదో - "అసలు మీకు కోపమే రాదా" - అన్నారు అన్నపూర్ణా స్టూడియోలో.

## ఒరుల మేలు కోరే నాకెందుకు కోపం?


ఆనాడు అక్కినేని ఎక్కలేని మెట్లు లేవు' అన్నట్టు - ఈ 90వ వయసులో కూడా ఏ చేతి కర్ర ఊతమూ లేకుండా మెట్లు ఎక్కుతున్నారు. అలాగే నటించే పాత్రల్లో కూడా వారి స్థాయి పెరుగుతూండే కానీ తరగడం లేదు, సంభాషణలు తడబడడం లేదు. స్పష్టత, నిర్దుష్టత కనపడుతూనే వుంది. పూర్ణ వయసు 120 సం॥ములు వచ్చేవరకూ ఆయనిలా దృఢంగా, దర్పంగా, దరహాసంతో ఉంటారు. మనసును నిర్మలంగా ఉంచుకొనేవారికి మనసుకూ, శరీరానికీ ఏ అనారోగ్యమూ ఉండదు. ఇప్పటికీ ఆయన కొడుకు, మనుమలతో హుషారుగా నటిస్తూనే ఉన్నారు. డెబ్బై అయిదు సంవత్సరాలు సుదీర్ఘ నట జీవితంలో ఆయన నటించని పాత్రలు లేవు.

## ఆయన ఎవ్వర్‌గ్రీన్ హీరో!

అమెరికాలో శస్త్రచికిత్సను చేయించుకుని వచ్చిన తరువాత కూడా, ఆయన అప్పటి యువ కథానాయకుల కన్నా మిన్నగా 'స్టెప్పులు' వేసేవారు. కుర్రకారును గిలి గింతలు పెట్టేవారు. సాధారణ జీవితంలో కూడా ఆయన నొప్పించిన సందర్భాలు లేవు.

ఆయన తొలి అమెరికా పర్యటనం విజయ వంతంగా జరుపుకొని వచ్చిన సందర్భములో ఇంటూరి వేంకటేశ్వరరావు గారూ నేనూ కలిసి ఆంధ్రా ఫిలిమ్ జర్నలిస్టు అసోసియేషన్ తరఫున రాయపేట ఉడ్‌లాండ్సులో పూర్ణాహార విందు సత్కారం చేసాం. నా మట్టుకు నేను రచించిన 'పద్మశ్రీ అక్కినేని' గ్రంథాన్ని సవేరా హోటల్‌లో ఆయన బస చేసినప్పుడు సూర్యోదయం సమయంలోనే పండ్లూ, పుష్పాలతో గ్రంథ సమర్పణ చేసాను. అటు తరువాత నేను ఏ నటుని చరితమునూ గ్రంథ రూపమున వ్రాయలేదు, ఎవరినుండీ ప్రతి ఫలాపేక్ష ఆశించలేదు.

అక్కినేని దేవుడు లేడంటారుగానీ, మనుష్యుల్లో గల మంచి గుణమును దేవునిగా భావించి, ఆరాధిస్తారు. తెలుగు సినిమా ఈ ఎనభై సంవత్సరముల కాలంలో - ఆయనకు పూర్వం, ఆయన తెరమీదకు వచ్చిన తరువాత ఎందరెందరో మహానటులు వచ్చారు. కానీ అక్కినేని నటించినన్ని విభిన్న పాత్రలు ఎవరూ ధరించలేదు. తెలుగులో ఆయన నటించిన 'దేవదాసు', 'బాటసారి', 'విప్రనారాయణ' - స్థాయి గల చిత్రాల్లో ఆయన చూపిన నటనాశైలి, ఇతర భాషల్లోని నటులెవ్వరూ ప్రదర్శించలేదు. అందుకాయన గర్వించలేదు. 1973 మద్రాసులో జరిగిన నా సన్మానానికి హైదరాబాద్ నుంచీ ప్రత్యేకంగా వచ్చి తన సహృదయతను చూపినందుకు కృతజ్ఞుణ్ణి. ●



# ధర్మపురుష, సౌరదీక్షా సార్వభౌమ, సోమయాజి పరమ పవిత్ర ప్రజాశ్రేయోమూర్తి సద్గురు కృష్ణయాజీ

జ్ఞానం దైవప్రేరితమ్ – సత్యం ప్రకృతి పూరితం. నిజానికీ రెండూ శీలసంపన్నత, ప్రియభాషణం, కృతజ్ఞత, ప్రశాంతతత్వాలుగల ధర్మానువర్తనులకు దైవసంపదలుగా సిద్ధించినా, దానధర్మాలు, పరోపకార పరాయణత్వం మానుష సంపదలుగా లభిస్తాయ్. ప్రస్తుత కాలంలో హృదయంలో ఇనుపగుండ్లు నింపుకున్నవారే హెచ్చుగ కనిపిస్తున్నందున యాంత్రిక స్వభావన మానవుల్లో కనిపిస్తున్నది.

ఋషుల నిలయం, ఋషితుల్యమైన గురువులతో నిండిపోయిన యీ పవిత్ర భారతఖండంలో నిస్వార్ధప్రణాళిక, ధర్మాచరణ కల ఋషితుల్యులూ నిత్యాగ్నిహోత్రులూ నేత్రాలకు చిక్కుతారాయని ప్రతీ సూర్యోదయం వంకా చూస్తున్నాను. కానీ ఆయన 'మెర్కురీ గోళం'లా తక్క సహస్ర కిరణతేజోభూషితుడైన సప్తాశ్వర రధారూఢునిగా అర్కుడు కనిపించడంలేదు. అందుకే కరుణశ్రీ మనసుకందినట్లు నా మనస్సుకంది:

**గగనాన విహంగమై ఎగిరినా, గుండుచేపలా కడలిలో ఈదులాడినా, భూమి మీద మానవుడిగా మనలేడతడు. తెలతెలవారువేళ తెరతీయగ తెరతీయగ పక్షి సంతుతుల్ కలకల కూయువేళ, పయగ్రమ్మిన మబ్బుల్ వాన చినుకులున్ । జలజల రాల్చువేళ, సహజముగా స్వప్నములో స్తనందముల్ కిలకిల నవ్వువేళ, తిలకింతున్ నీ సొగసుల్ జగత్ప్రభూ అనుకుంటూంటాను.**

ప్రపంచమంతా వ్యాపార దృక్పథంతో ఉన్న ఈ వేళ ప్రజోపకారహితైషిత, దేశం సౌభాగ్యవంతంగా ఉండాలనే దీక్షా కంకణబద్ధుడైన – పూర్వకాలపు ఋషీశ్వరుణ్ణి వంటి పూర్వ పుణ్య సుగుణ రాశిని గూర్చి, వేమకోటి కృష్ణయాజి గారి భాషలో తెలుసుకుందాం:

కాశీ పుణ్యక్షేత్రమందు పరమపూజ్యశ్రీ శ్రీ భాస్కరానందతీర్ధస్వాముల వారు దివ్యానుగ్రహముతో – ఉపదేశించిన శ్రీ సావిత్రీ మాతా – అష్టాక్షరీ – శ్రీ సవితామాతా షోడశాక్షరీ శ్రీ గాయత్రీ మాతా చతుర్వింశత్యక్షరీ – షట్త్రింశతి (36) సూర్యదేవతా – మంత్రములను క్రమదీక్షతో అనుగ్రహించి అస్మద్గురు దేవుల దివ్యాదేశాను సారము 1970 సం॥ పార్వతీపురమందు శ్రీసూర్యపీఠమును – నిర్మాణముగావించి అందు త్రిమాతృకులను శ్రీ మోహినీ దేవీ సహిత ఖషోల్కస్వామిని ద్వాదశాదిత్యులను ఆదిత్య పంచాయతన దేవతలను – శ్రీ వేంకటేశ్వరస్వామి శ్రీ అయ్యప్పస్వామి – శ్రీ దత్తాత్రేయస్వామి – శ్రీ ఆంజనేయస్వామి – శ్రీ ఆదిత్యాది నవగ్రహములను – శ్రీ షిరిడి సాయిబాబాను శ్రీ భాస్కరానందతీర్ధస్వామి వారి విగ్రహములను ప్రతిష్టించి నిత్యారాధలను చేయుచు, నిరంతరము యజ్ఞ యాగాదికములను నిర్వర్తించుచు. శ్రీ భాస్కరై నిగమాగమ పాఠశాలను, శ్రీ భాస్కర ఆయుర్వేద వైద్యశాలను నెలకొల్పి, ప్రజాధనముగానీ, ప్రభుత్వ ధనమునుగాని స్వీకరించక, నిర్మాణములు నిర్వహణములను, స్వయముగా చేయుచూ గురుదేవుల ఆదేశానుసారము, 27 సంవత్సరములలో 16 వందల మందికి, భారతీయ సనాతన సంస్కృతిని, వైదిక సంప్రదాయ జీవనమును – ఉపాధులను కల్పించి భారతీయునిగా కర్తవ్యములను నెరవేర్చితిని.

పెద్దకుమారుడు వేమకోటి నరహరిశాస్త్రిని, వేదశాస్త్రము లందు, ఆంగ్ల విద్యయందు పోస్టు గ్రాడ్యుయేషన్స్‌గా, నిష్ణాతులను జేసి – చిన్నబ్బాయి – వేమకోటి సూర్యనారాయణశర్మను – వేదశాస్త్రములందు ఆంగ్ల విద్యయందు గ్రాడ్యుయేషన్స్‌గా నిష్ణాతుల గావించి యిరువురకు – శ్రీ సూర్యపీఠమందు, యజ్ఞయాగాది నిర్వహణను వాస్తు, జ్యోతిష, ప్రశ్న శాస్త్రములను ఉచితముగా, ప్రజలకు అందజేస్తూ, విధులను నిర్వహించవప్పగించి, 1997 సం॥ములో గరివిడి గ్రామమందు, భగవాన్ సత్యసాయి ఆదేశానుసారము శ్రీ సూర్య సదనమును (వానప్రస్థాశ్రమములను) నిర్మాణము గావించి అందు, 108 విగ్రహములతో శ్రీ సూర్యస్థూపమును, శ్రీ మహాసౌరయాగ శాలయందు శ్రీ గాయత్రీ మాతా శ్రీ సూర్యనారాయణ స్వామివారిని ప్రతిష్టించి శ్రీ సాయియోగి నిష్ఠా మందిరం – శ్రీ సద్గురు నిలయం – భక్తుల వసతి గృహములను నిర్మాణము గావించి – శ్రీ భాస్కర ఆయుర్వేద నిలయమును అందు శ్రీ మద్ధన్వంతరీ విగ్రహమును ప్రతిష్ఠించి, బీదలకు ఉచిత వైద్య సేవలను అందిస్తూ, ఆసక్తిగలవారికి చతుర్విధ యోగాభ్యాసములని జ్ఞానచతుష్టయములను బోధించుచూ – రెండవ కుమారునిచే (వేమకోటి సూర్యనారాయణశర్మ) యజ్ఞయాగాది నిర్వహణను జ్యోతిష, వాస్తు, ప్రశ్న శాస్త్ర పరిశీలనం, ప్రజలకు, ఉచితముగా జరుపు బాధ్యతలను ఒప్పగించి, ప్రముఖ, వేద శాస్త్ర సంగీత నృత్య కళా తపస్వినులను సన్మానించుచూ ప్రోత్సహించు అనేక పేద బ్రాహ్మణ కుటుంబములకు, గృహ నిర్మాణములు గావించి యిచ్చుటయు – ఉపనయన, వివాహములను ఉచితముగా, పూర్తి ఖర్చులతో జరిపించుటయు – సాహితీ క్రతువు అను పేరుతో బహు గ్రంథములను రచించి, 24 గ్రంథములను అచ్చు వేయించి పెద్దబ్బాయి వితరణ చేసెను. చిన్నబ్బాయి 16 గ్రంథములను రచించి అచ్చు వేయించి వితరణ చేసియుండెను. 13 ఆస్థాన పండితుల గ్రంథములను అచ్చు వేయించి వేల సంఖ్యలో వితరణ చేయుచు యధోచిత, సాంస్కృతిక సేవా కార్యములను జరుపుచుంటిమి.

**– సద్గురు కృష్ణయాచేంద్రులు**

మలేషియా లేఖ

# అచ్చ తెలుగు మాట వస్తుందా?

ఓ తెలుగు అమ్మల్లారా, అయ్యల్లారా ఆలోచించండి, సుమారు డెబ్భై ఏండ్ల క్రితం వేదాచలం అను ఒక అరవవాడు తన కూతురుతో మాట్లాడుతూ, ఓ కూతురా! మన అరవం అచ్చ అరవ మాటగా వ్రాయాలి, మాట్లాడాలి. సంస్కృతమో, ఆంగ్లమో లేకుండా (ఏ పరమాట) కల్మషం లేని వట్టి అరవ మాట మాట్లాడినపుడే అరవ సాంప్రదాయ బ్రతుకును బ్రతుకుకలుగుతాం. వెంటనే తండ్రీ కూతురు ఆ ఘడియనుండి అచ్చ అరవమాటలను ప్రారంభించారు. అందుకని తన పేరును కూడా మార్చుకున్నాడు.

ఆయన వేదాచలం (వేదము+చలము) అన్న తన పేరును మరై+మలైగా మార్చుకొన్నాడు. ఆనాటినుండి తన ఊపిరి ఉన్నంతవరకు అరవం మాత్రమే మాట్లాడారు. అతని బాటననుసరించి పలు అరవ వ్రాతగాళ్ళు పుట్టారు. సూచనకు తిరు.వి.క.అను కళ్యాణ సుందరం, డాక్టరు ము. వరదరాజన్ అను వరదరాజులు (తెలుగువారు) ఇతని శిష్యులు పులవరు దండాయుదు (తెలుగువాడు) ఇంకా పలువురు అచ్చ అరవ వ్రాయడం మొదలెట్టారు. వందలకొలది అరవ పుస్తకాలు అచ్చ అరవంలో వ్రాసారు. ఇంకా క్రొత్తగా వ్రాస్తూనే యున్నారు.

ఈ నిజం ఎందుకు వ్రాస్తున్నానంటే, తెలుగువారు అటువంటి అచ్చతెలుగు సంఘాన్ని ఇంకా పుట్టించలేదు. అటువంటి తలంపే ఇంకా ఏ తెలుగోడికీ ఏర్పడలేదు. అరవమాట ఉన్నతికి అరవ సంఘము 1500 ఏండ్ల క్రితం స్థాపించినట్లు అరవ చరిత్రలు చెప్తున్నాయి. మూడవ వెయ్యేండ్లు మొదలిడి పండ్రెండు ఏళ్ళు అగుచున్నవి. ఏ తెలుగువాడికైనా అచ్చతెలుగు మాట్లాడాలనే తలంపు పొడిసిందా? తమ పుట్టిల్లో . మాప్రక్కనేయున్న అరవలు వారి తల్లి మాటను పెంచుటకు ఏమిచేస్తున్నారో గమనించేనా కాస్త జాగ్రత్త పడండి. తెలుగు మాట దిగజారిపోతుంది. మాయమైపోతుంది. కండ్లు తెరవండి. గురకలు పెట్టి మరి కునుకుతున్నారు. ఏవీ పట్టించుకోవటం లేదు. కన్నతల్లి భాష ముఖ్యం.

అందుచేత, ప్రముఖాంధ్ర సంపాదకులైన శ్రీ గోటేటి శ్రీరామారావు అన్నయ్యగార్కి తెలుగోళ్ళు మలేషియా నుండి ఓ కేక వేస్తున్నాను. నా కేక తమ చెవిలో పడిందే సుధీర్ఘాలోచించి, అచ్చ తెలుగులో తమ వ్రాతలు ప్రముఖాంధ్రలో మొదలెట్టండి. మీ వెనుక వ్రాయువారు అలాగే మొదలెడు దురు.

"అచ్చతెలుగు మాట" సంఘాన్ని ఏర్పఱచండి. విత్తనం నాటితే మొక్క మొలుచును. చిగురించును, చెట్టగును. పూవులు, పిందెలు, కాయలు, కొమ్మలు జంటలుగా పెరుగును. అట్లే మనతల్లి తెలుగుతల్లి అచ్చతెలుగు తల్లిమాట అను సంఘాన్ని పుట్టిస్తేగాని అచ్చతెలుగు మాట విరాజిల్లదు. వెలుగొందదు, వికసించదు. ఏలనంటే తెలుగువారే తల్లి మాటను గౌరవించడం లేదు. అందుచేత తమరు ఈ పనికి నడుము బిగించాలి.

తెలుగు దేశంలో బ్రతికే తెలుగువార్కి తెగులో ఏఁవో! తెలుగు దేశ నాయకులు, పాలకులు తెలుగు మాధ్యమాలు, పత్రికలు, దవ్వు చూపి (టి.వి) నింగోస (రేడియో) తెలుగు ప్రజలు మొదలు ఎవరును తెలుగులో ఒక్క తెలుగు వాక్యమైనను మాట్లాడ్డం లేదు! మాట్లాడలేక పోతున్నారు. తెలుగు పత్రికలు తెలుగును తెగ చంపుచున్నవి. వాటికి తోడు తెలుగు కార్యాలు జరిపే (దవ్వు చూపి, నింగోసలలో) వారు మరీ రెచ్చిపోతున్నారు. తెలుగును చంపుటకు. తల తిన్నగా వెళ్తే తోక తిన్నగా వచ్చునని సామెత. తలనే తెలుగుదేశ నాయకులు పాలకులు సరిగా చేస్తే, తోకయనబడు తెలుగు ప్రజలు వెనుక చక్కగా వస్తారు. తెలుగు మాట మాయమయేది ఎవరివల్ల? పరిపాలకులదే గదా? ఓ తెలుగుదేశ పాలకుల్లారా ఇంకా ఎంతకాలం గుర్రుపోస్తారు. మత్తు కునుకులో యుంటారు కుంభకర్ణుల్లా మీరు, మన తెలుగు తల్లిని ఎత్తుతారా దించుతారా అది మీ చేతుల్లోనే యుంది.

ఎవరు చేస్తారో లేదోగాని ప్రముఖాంధ్ర చేస్తాదన్న నమ్మకం నాఎదలో పుట్టింది. ప్రముఖాంధ్ర వంటి మరో తెలుగు దివ్వ "అచ్చతెలుగు మాట"అను సంఘాన్ని పుట్టించ పూనుకోవాలి. ఆ తెలుగు వెలుగు తెలుగుల పుట్టిల్లో దూరాలి.

ఓ తెలుగన్నయ్యా! ప్రముఖాంధ్ర సంపాదకా! శ్రీ గోటేటి శ్రీరామారావు అయ్యా! కదపండి తమ కలమును అచ్చ అమ్మవంటి, అందమైన, తేనెకన్న తీపైన తెలుగు మాటలతో మొదలెట్టండి. తెలుగు మాటలను. తెలుగు వారికి ప్రత్యేక తెలుగు దేశం అమరులు శ్రీ పొట్టి శ్రీరాములు గారు తెచ్చారు. తనూపిరినే త్యాగం చేసారు. "అచ్చతెలుగు మాట" సంఘాన్ని శ్రీ గోటేటి శ్రీరామారావుగారు తెచ్చారు అని తెలుగు లోకం చెప్పాలన్నదే నా అభిలాష. ఆ పొగడ్తకు తగిన, సరైన సాధన చేయగల తెలుగు బిడ్డవయ్యా మీరు! పూనుకోండి! పుట్టించండి! అచ్చతెలుగు మాట సంఘాన్ని స్థాపించండి.

హనుమంతుడి శక్తి ఇతరులు చెప్తేనే ఎరుగును. అట్లే మీ శక్తి అచ్చతెలుగు మాట సంఘాన్ని ఏర్పరచ గలరా అన్నది మీకు తెలియకపోవచ్చును. కానీ మాకు తెలుసు. మీకు ఆ శక్తి ఉందని.

చిటికయైన ఆలశ్యం చేయక సాధన చేయండి. సాధించగలరు. ఇది నా వినయ విధేయ విన్నపం! ప్రార్థన! కోర్కె! మ్రొక్కులు.


నా ఒంట్లో ఊపిరున్నంత వఱకు నా ఎదలో నిల్పెద తమ తెలుగు సేవను తెలుగును వెలిగించిన సాధనను. తెలుగువాళ్ళు ఎదల్లో తమ రూపం, పేరు నిలిచిపోవును.

మీవలె నాకు తెలుగు తెలియదు. అందుచేత నా వ్రాతల్లో తప్పులుంటే మన్నించ వేడుకొంటున్నాను.

మరి శెలవు. తెలుగుతో బ్రతుకుదాం! మ్రొక్కులు.

– **గోపిశెట్టి శ్రీరాములు,** మలేషియా

*(ఈ లేఖను యధాతథంగా శ్రీరాములు గారి భాషలోనే ప్రచురించాం.)*




# వైదిక సాంప్రదాయాధ్యయనం చేసి, హేతువాదబద్ధుడైన త్రిపురనేని రామస్వామి

హేతువాదహితైషి, పురాణ విమర్శకుడు 'ధర్మో రక్షత రక్షతి' అను సాంప్రదాయ నుడిని చివరి శ్వాస వరకూ మరో మార్గంలో వడసిపట్టుకున్న కవి రాజు త్రిపురనేని వీరాస్వామి చౌదరి. హేతు సాంప్రదాయానుసారం ననుష్టేయములు చేసుకున్నవాడు.

ప్రకృతిలో కారుణ్య స్వరూపము చూడగల ధన్యుడే ధనుర్మాసంలో పుడతాడు. ఈ ద్యావాపృథ్వులే (నింగీ, నేలా) తల్లిదండ్రులంటుంది వేదం. ఆర్య సంస్కృతిలో మనసును తల్లిగా పోషించేది భూమాత. ఈ తల్లి సామర్థ్యాన్నిచ్చి వెన్నంటి ఉంటుంది ఆకాశం. కురిసే వర్షాలుతో జ్యోతిర్మండల శక్తి కాంతిపూరితంగా ఉంటుంది. ఆయన పుట్టిందీ, పుడమ తల్లి ఆహ్వానంలోకి తరలి వెళ్ళినదీ జనవరి 15, 16 లే. పర్వ సంక్రమణంలోపుట్టి పరువంగా జీవితం గడిపి, ఆ పరువ సంక్రమణంలోనే భూమిలో కలిసిపోయిన కవిరాజు, అవధాని, మహాపండితుడూ! పండిత పామర జనరంజకుడైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రివరేణ్యుని శిష్యుడు త్రిపురనేని రామస్వామి చౌదరి అంటే కొంతమందికి ఆశ్చర్యం కూర్చవచ్చు. వారి భాష, ఛందస్సు, గురువు గారి అవధాన ప్రక్రియ రామస్వామిచౌదరి లేబ్రాయం నుంచే అలవడ్డాయ్. గురువు గారి వలె గ్రాంథిక భాష పద్యరచనంలో కూడా మంచి రసపట్టును సాధించారు.

ఒక్కొక్క కవి ఒక్కొక్క పదవ్యూహాన్ని పద్మ వ్యూహంలా పకడ్బందీగా చెప్పడంలో ప్రాచుర్యం వహిస్తారు. సంగీత సాహిత్యాల్ను, రెండూ వీణా తంతులుగా సమ్మోహపరిస్తే, మరికొందరు కవులు వాటిని వింటినారగా చేసి భావాలను వేడివాడిగా చూపిస్తారు. త్యాగ రాజు కొమ్మ చల్లిన పుష్ప, ఫలబీజాలు యావద్భారతమునా, గిరులూ, తరువులూ, సాగరములు దాటి ప్రపంచం నాలుగు చెరుగులా నేటికీ పరిమళిస్తూ పరవశింపచేస్తున్నాయంటే రాగంలో అంతర్లీనంగా ఒదిగే పదాలను పొదగడమే అందుకు కారణం. గాకపోతే 18వ శతాబ్దివాడిప్పటికీ (మరి ఎప్పటికీ) గుర్తున్నారంటే సామాన్యవిషయమా.



జయదేవుని కడక్రోధమై రాధచరణాలు ముద్దుల మౌళిపై మోసి మోసి 'అన్నమాచార్యుల సమక్ష మందెదు కొండల నొంటిటగా కాపురం ఉండి యుండి, క్షేత్రయ్య రసరమ్య క్షేత్రాన ఏలినాయి. కలబిగి కౌగిళ్ళ నలిగి నలిగి, విసిగిపోయి సుంత విశ్రాంతి కోసమై, సీతతోడ అనుంగు భ్రాతతోడ. విశ్వమయుడు ప్రభువు వేంచేసియున్నాడు రాముండగుచు 'త్యాగరాజు నింట' అని అంటారు. జంధ్యాల పాపయ్యశాస్త్రి.

అలా త్రిపురనేని రామస్వామి చౌదరి, ఆయన సాంప్రదాయ ఇతిహాస రామాయణముల నెంతగా వ్యతిరేకించినప్పటికినీ – **'వీర గంధము తెచ్చినాము వీరుదెవ్వడో తెల్పుడీ పూసిపోదము, మెడను వైతుము పూలదండలు భక్తితో'** – ఎక్కడకు పోతుంది పుణ్య భారతసీమన, పావన కృష్ణా తీరమున బుట్టిన కవితాగంధం మూలస్థావరపు గురి తప్పదు. తత్పర్య విశేషములే మైనప్పటికినీ మూలవేఱున చిగిరించిన పద్యసౌరభం ఆయనకు 'కవిరాజు' అనే గండపెండేరము కట్టింది.

రామస్వామి చౌదరి 1887 సం॥ము జనవరి 15న కృష్ణాజిల్లా అంగలూరు గ్రామంలో ఆర్య సంస్కృతీ సాంప్రదాయాలను గౌరవించే కుటుంబంలో పుట్టడం, వారా బిడ్డకు పవిత్ర సంస్కృతీపరమైన రామస్వామి పేరు పెట్టడం, తల్లిదండ్రులు బిడ్డకు వస పోసినట్టు రామాయణ, భారత, భాగవతాది సాంప్రదాయ సాహిత్యాల్ను నేర్పించడం అన్నీ విశేషములు కాగా, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు వద్ద సాంప్రదాయ విద్య నేర్పించడమనేది చూస్తూంటే బ్రహ్మర్షి వశిష్టుని వద్ద శ్రీరాముడు యోగ సాంప్రదాయ విద్యను నేర్చించడం చూస్తూంటే – అతడొక రాముడే అవుతాడని అందరూ భావించారు. ఆయన అందరూ విద్యనభ్యసించిన బందరు హిందూ ఉన్నత పాఠశాల, కళాశాలల్లో, విదేశ విద్యాలయాల్లో బార్–ఎట్ లా చదువుకుని బందరు, విజయవాడ నగరాల్లో న్యాయవాదిగా పనిచేస్తూ, స్వంత ఊరిని మించిన స్వర్ణగర్భమేమున్నదని తెనాలిలో స్థిరపడ్డారు. సుప్రసిద్ధ శాస్త్రవేత్తల్నూ, కళాకారుల్నీ, కవితామూర్తులకు తెనాలియే మూలగడ్డయనడంలో అవగింజంతయైనా సందేహం లేదు. ఈయన ఎంతటి దిగ్దంతముల భాసిల్లే మాణిక్యమవుతాడోనని, స్వజనం, సన్నిహితజనం భావించారు. సంప్రదాయ భాష, సంస్కృతి, చంధస్సులు ఆయనకు కరతామలకమైనాయ్. మరొక శ్రీనాధునిగా భావించి అభిమానులు 'కవిరాజు' కిరీటం పెట్టారు. అది ఆ తెనాలి మట్టిరేణువులు చేసుకున్న పుణ్యమనుకున్నారు. న్యాయవాచికం నుంచీ, ఆయన వాచికం రాజకీయం వాచికం వైపుకు మరలింది. 1925 సం॥ములో తెనాలి పురపాలక సంఘ అధ్యక్షులయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యులుగా నియమింపబడ్డారు. విదేశాల్లో చదువు తూండగానే విద్య, విజ్ఞానం, వివేచనా శక్తిగల ఆయన మేధలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయ్. సనాతన సాంప్రదాయంలోని సదాచారాలన్నీ ఆయనకు మూఢాచారాలనిపించాయ్. అవి ఏపుగా పెరిగిన పంటచేలల్లోని కలుపుముక్క లనిపించాయ్. తెనాలి వాస్తవ్యులు అనుచారంగా జాతరల్లో చేస్తున్న జంతుబలులకు పుల్–స్టాపు పెట్టించినది రామస్వామి గారే!

1910 సం॥ములో అంగలూరులోని ఓ ప్రాథమిక పాఠశాలలో హరిజన బాలికకు ప్రవేశం కల్పించి, తనవారి ప్రక్కనే కూర్చునేట్టు చేసి చదువు చెప్పించడం స్వసమాజంలోనే కంటగింపు కల్పించారు. సెనేటు బోర్డు మెంబరుగా కొన్ని కొత్త సంస్కరణల అమలుకు ప్రయత్నాలు చేసారు. తాను సంస్కృతాంధ్ర భాషల పండితుడయ్యుండీ, విదేశాల్లో జరిగే వివాహముల్లో అందరూ మాట్లాడుకొనే భాషలోనే వివాహాలు చేస్తున్నారని సంస్కృత మంత్రార్థాలను తెలు గించి 'వివాహవిధి' పుస్తకాన్ని వ్రాసి, పెళ్ళిళ్లు జరుపడం ప్రారంభించారు. కొన్ని వివాహాలకు తానే పురోహితు డయ్యారు. దీనితో ఆయన వైదిక సాంప్రదాయాల్నీ, సాంప్ర దాయ ప్రియులనూ దూరం చేసుకున్నారు.

బ్రాహ్మణ వ్యతిరేకతతో బాటు, ఆర్య ధర్మ వ్యతిరేకత నిర్దుష్టంగా కనపడింది. ఆర్యజాతి అధికారాన్ని, ఆధిక్యానికీ రామాయణం కారకమవుతుందని రామాయణాన్ని ఆయన సంపూర్ణంగా వ్యతిరేకించారు. ఆయన సంస్కృ తాంధ్రములను క్షుణ్ణంగా చదివి, విజ్ఞాన, విచక్షణలు కలిగిన పుంభావ సరస్వతి అనదగిన రామస్వామి చౌదరిగారు మనసున ఏదో అపోహనుంచుకుని, సాంప్రదాయ సాహిత్యంపై కత్తి కట్టారు. ఆ విమర్శనా హేతువుకు కారణం కొంతమంది అపోహ కల్పించినట్టు బ్రాహ్మణేతరు లకు పురాణ వాఙ్మయంలో ఏదో హాని జరిగిందని నేను భావించడం లేదు. వేదం వేంకట్రాయశాస్త్రి ప్రతాప రుద్రీయంపై, విశ్వనాధ సత్యనారాయణగారి 'వేనరాజు' నాటకంపై కవిరాజు తీవ్ర విమర్శలు కురిపించారు. 'వేనరాజు' నాటకానికి ప్రతిగా ఆయన 'ఖూనీ' నాటకం వ్రాసి తీవ్ర సంచలనం లేపారు. ఓ నూత్న భావధారకూ, తాత్విక చింతనకు కొందరు గురయ్యారు. ఇతిహాస పురాణాల పట్ల ఇదొక ధిక్కార స్వరంగా భావించారు. సంగీతంలో కల ఆరోహణ అవరోహణ లనుకుని సంభావించుకున్నారు కొందరు.

తెనాలిలోని తన ఇంటిని 'సూతాశ్రమంగా' మార్చారు. సూతాశ్రమం నుంచే తన రచనా వ్యాసంగాన్ని కొనసాగించారు. నీతిలేని వారిని నిరసించు జగమెల్ల అంటూ తాను తలచిందే ఆచరించారు. 'ధర్మోరక్షతి రక్షితః' అనే ధర్మోక్తిని మరో కోణంలో మార్చుకుని ప్రవచించారు. జస్టిస్ పార్టీ సిద్ధాంతాలొకవైపు, వైదిక సాంప్రదాయాలను విడనాడని పురాణ విమర్శ. హేతువాదాన్ని విడనాడని మానవతా వాది త్రిపురనేని రామస్వామి చౌదరిదొక శకం. ఎవరిపైననూ నిరంకుశంగా తన భావాలను దిద్దిన దాఖలాలు లేవు. అందుకే ఆయన కుమారుడు గోపీచంద్, ఇతర కుటుంబ సభ్యులు హనుమాన్ చౌదరి, సాయిచంద్ ప్రభృతులు హేతు వాదాన్ననుసరించలేదు. మరో విచిత్ర చిత్రం 1887 జనవరిలో పుట్టిన ఈ కవిరాజు 1943 సం॥ము జనవరి 16నే పరమపదించడం సంక్రమణ కాల విశేషం. మార్గాలు వేరైనా ఆ మార్గాల పట్ల వారు ప్రదర్శించిన చిత్తశుద్ధిని ప్రముఖాంధ్ర గౌరవిస్తుంది. ●

# ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులూ! మీవంటివారేరీ?



శిథాలావస్థకు చేరుకున్న భవనాలు



శారదానికేతన్ వ్యవస్థాపకులు
ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులు

గతం ఎప్పుడూ ఘనీయం; వర్తమానం దయనీయమని చెప్పుకోవాలి. ఆయన శోత్రీయుడైన బ్రాహ్మణుడు. కానీ ఏ ఇరవై ఒకటవ శతాబ్దానికో పుట్టవలసిన ఆలోచనలు, ఆయనలో 1922 సం॥ములోనే పుట్టుకుని వచ్చాయ్.

మహిళలు విద్యావంతులైననాడే దేశం అభివృద్ధి చెందుతుందనీ, వారిని వంటింటి కుందేలులా, కూర్చోబెడితే దేశాభ్యున్నతి కుంటుపడుతుందనీ భావించిన దీర్ఘదర్శి, తొలి మార్గదర్శి ఉన్నవ లక్ష్మీనారాయణ. స్త్రీలు చదువుకున్ననాడే స్వాతంత్ర్యోద్యమ భావనా వీచికలు దేశమంతా వ్యాపిస్తాయనీ, స్వాతంత్ర్యోద్యమం పటిష్టం అవుతుందని భావించిన వాడు కూడా ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారే! అందుకు తగ్గట్టు ఆయన సతీమణి లక్ష్మీబాయమ్మగారు కూడా ఆయనకు బాసటగా ఉండి, ఉద్యమానికి ఊతనిచ్చారు. ఆ ఇద్దరూ ఒక్కరై, మహిళ విద్యాభ్యున్నతి కోసం గుంటూరులోని అరండల్‌పేట 4వ లైనులో శ్రీ శారదానికేతన్ అనే మహిళా కళాశాలను చిన్నగా ప్రారంభించారు. 1922 సం॥మున నవంబర్ శ్రీ శారదా నికేతనము మహిళా వృత్తి విద్యాకళాశాలగా ప్రారంభమైంది.

దళితులనే పదం పెట్టలేదు. మాలలు అనే ఐదవ వర్గానికి ప్రత్యేక కాలనీలుండేవి. వారు ఊరివారి పనులకు వచ్చేవారు. ఉన్నవ వారు మాత్రం వారిని వేరుగా చూచేవారు కాదు. ఆయన ఇల్లు అందరిల్లు, ఆత్మీయతలు పెనవేసుకొన్న పొదరిల్లు. శారదా కళానికేతనం సహృదయనికేతనం – అభాగ్యులైన వారెందరో ఆ ఇంటి యిల్లాలు, లక్ష్మీనారాయణ పంతులుగారి సహధర్మచారిణి లక్ష్మీబాయమ్మ అక్కడుండే వారందరికీ ఓ తల్లిగా ఉండేది. భోజనం పెట్టినప్పుడు కొసరి కొసరి వడ్డిస్తూ కడుపార భుజించమనేది. ఈ విషయంలో ఆవిడ పెద్దన్నగారి మనుచరిత్రలోని ప్రవరుని సతీమణి స్ఫురణకు వచ్చేది. వండి పెట్టుటయందు అలసట చెందదు వేవురు వచ్చినేని అన్నట్టు, లక్ష్మీబాయమ్మకు అలసటగానీ, విసుగుగానీ ఉండేవి కాదట. తీరుబాటు చేసుకుని వాళ్ళకు గోరింటాకు కాలంలో గోరింటాకు కూడా పెట్టేవారట. ఇవన్నీ గాకుండా లక్ష్మీనారాయణ పంతులుగారు కందుకూరి వీరేశలింగం పంతులుగారివలె వారింట్లో వితంతు వివాహాలను జరిపేవారు. సంఘసంస్కరణాభిలాషి, సమైక్యవాది, సకల జనహితవాది, రచయిత సంస్కర్త, ఆర్థిక, సాంఘిక, సామాజిక కుల భేదాలను పాటించని సమసమాజ వైతాళికుడు. ఎందరో విధివంచితులకు తన ఇంట్లో నీడ కల్పించిన మహోదయుడు. 'మాలపల్లి' నవల వ్రాసి అసమానతల్ను రూపుమాపిన శిల్పి.

రాష్ట్రంలోనే మహిళల కోసం ఏర్పడిన తొలి వృత్తి విద్యాకళాశాల శ్రీ శారదా నికేతనమే! దానిని ప్రారంభించి నిర్వహించింది ఉన్నవ లక్ష్మీనారాయణ లక్ష్మీబాయమ్మ దంపతులే! ఈ విద్యా నిలయాన్ని విస్తృతపరిచే ఉద్దేశంతో రాజానాయని వేంకటరంగారావు బహద్దూర్‌వారు, గుంటూరు బ్రాడీపేటలో రెండకరాల స్థలాన్ని ఉచితంగా యిచ్చారు. దేశభక్త కొండా వేంకటప్పయ్య పంతులు గారు చౌటాయపాలెంలో 143.45 ఎకరాల భూమినీ, జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరిగారు 45 ఎకరాల భూమినీ యిచ్చారు. అప్పటి మద్రాసు ఉమ్మడి రాష్ట్ర

**మాలల అంటరానితనమును రూపుమాపే ఉద్యమం ముందు బ్రాహ్మణుల నుంచే బయల్దేరింది. భూములున్న బ్రాహ్మణులు వాళ్ళకు మాన్యములిచ్చే పంటలు పండించుకోమనే ఉదారతనం బ్రాహ్మణుల నుంచే వచ్చింది. ఉన్నవ లక్ష్మినారాయణ పంతులుగారిని ఉదాహరణంగా చెప్పకోవచ్చు.**

ముఖ్యమంత్రి రాజగోపాలాచారి గారు బాపట్ల తాలూకాలోని మాలపాలెం వద్ద 92.34 ఎకరాల భూమినీ యిచ్చారు.

ఇలాటి మహిళా విద్యాలయం దేశంలో మరెచ్చటా లేదని విద్యాలయాన్ని సందర్శించిన మహాత్మాగాంధీ ప్రశంసించారు. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు దీక్షా దక్షతలతో దినదినాభివృద్ధి నొందిన ఈ విద్యాలయంలో ఓరియంటల్ కళాశాల, ఓరియంటల్ సెకండరీ స్కూలు, హిందీ పాఠశాల, మరికొన్ని వృత్తి విద్యా కోర్సులు సమాహారంగా వృద్ధి చెందడం, సెంట్రల్ వెల్ఫేర్ బోర్డు అధ్యక్షురాలుగా ఉన్న దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చూచి, ఈ సంస్థకు 10 వేల రూపాయల్ను ఇండస్ట్రియల్ గ్రాంటుగా యిచ్చారు. దీనితో శారదానికేతన్‌లో ఇండస్ట్రియల్ స్కూలును ప్రారంభించారు.

ప్రముఖ చరిత్రకారుడు వకుళాభరణ రామకృష్ణగారు ఈ విద్యానికేతనం గురించి వ్రాస్తూ – ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారు రాజకీయాలను విరమించుకుని తన శేష జీవితాన్ని శ్రీ శారదానికేత్ అభ్యున్నతికే అంకితం చేశారన్నారు. అయితే వారి ఉత్సాహాన్నీ, ఉద్వేగతనూ 1952 సం॥ములో వారి సతీమణి లక్ష్మీబాయమ్మగారు మరణించడంతో లక్ష్మీనారాయణగారి నెంతగానో కృంగదీసింది. లక్ష్మీబాయమ్మ ఆయనకు అర్ధాంగియే కాదు అర్ధశరీరి. ఇంకా చెప్పాలంటే పూర్ణభాగిని. ఆ బాధనుంచీ ఆయన కోలేకోలేదు. 1958 సం॥ము సెప్టెంబర్ 28న ఆయన కూడా కన్నుమూసారు.

చంద్రుడు లేని రాత్రిలా, ఉన్నవ దంపతులు కాలం చేయడంతో శారదా నికేతన్ కళ తగ్గిపోయింది. క్రమేణా కృష్ణపక్షం ఛాయలు కమ్ముకున్నాయ్. తరువాత లక్ష్మీనారాయణ దంపతుల్లా నిర్వహించేవారు లేకపోయారు. దాతలిచ్చిన ఆస్తులు ఆర్థిక లావాదేవీల్లో హారతి కర్పూరంలా హరించిపోయాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈ పాఠశాలను తీసుకున్నది. ప్రస్తుతం ఈ పాఠశాల కరస్పాండెంటుగా తెల్లాప్రగఢ సుభద్రగారు నిర్వహిస్తున్నారు. శేషించిన ఆస్తిని విక్రయించి జాతీయ పొదుపు పథకంలో వడ్డీకి వేసారు. కొంత భాగాన్ని అద్దెకు యిచ్చారు. నెలకు వచ్చే 13 వేల రూపాయల స్వల్ప ఆదాయంతో శ్రీ శారదానికేతన్ దాఖలాగా ఉన్నట్టు ఉందంటే, ఉద్యమకర్తల లేమితో కొడిగట్టిన దీపాల్లా వెలగడం చరిత్ర చెప్పిన సత్యం. తెలుగువాళ్ళూ – ఒక్కసారైనా ఉన్నవ దంపతులను జ్ఞాపకం చేసుకోండి. తీపి జ్ఞాపకాలే మనకు సంతృప్తినిస్తాయ్. ●



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



79

## పదకొండవ అధ్యాయము - విశ్వరూప సందర్శన యోగము

**46. కిరీటినం గదినం చక్రహస్త**
**మిచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ**
**తేనైవ రూపేణ చతుర్భుజేన**
**సహస్రబాహో భవ విశ్వమూర్తే.**

**వ్యాఖ్య:** ఈ శ్లోకమునం దొక ప్రశ్న యుదయించుచున్నది - 'తేనైవ = ఆ చతుర్భుజ రూపముతోనే' ప్రత్యక్షమగుము - అని యడుగుటలో అర్జునుడు భగవానుని చతుర్భుజాకారమును, పూర్వము చూచినట్లే స్పష్టమగుచున్నది. అయితే దానిని ఎపుడు చూచెను? ఈ అధ్యాయమందలి 41, 42వ శ్లోకములలో అర్జునుడు భగవానునితో 'నిన్ను సామాన్య సఖునిగనెంచి పరిహాసపూర్వకముగ పలికిన వాక్యములను క్షమింపుము' అని వేడుకొనుటబట్టియు, భగవానుడు చతుర్భుజా కారముతో నెపుడైన గన్పట్టియుండినచో ఆప్రకారము సామాన్య సఖునివలె నాతనిని భావించి యుండెడివాడు కాదుగనుకనూ, ఆ యాకారముతో నతనికి పరిచయము లేనట్లే తేలుచున్నది. ఈ ప్రకారముగ పరస్పర విరుద్ధములగనున్న ఈ రెండు భావములను సమన్వయపఱచుటెట్లు? ఈ క్రింది విధముగ దీనికి సమాధానము చెప్పుకొనవచ్చును.

(1) విశ్వరూపము జూపుటకు ముందుగా ప్రారంభములో భగవానుడు సంతోషముతో తన చతుర్భుజాకారమును అర్జునునకు గన్పఱచి యుండవచ్చును.

50వ శ్లోకములో 'భూయః స్వకం రూపం దర్శయామాస' (తిరిగి తనరూపమును జూపెను) అని చెప్పి వెంటనే 'పునస్సౌమ్యవపుర్భూత్వా' (మఱల శాంతరూపమును ధరించెను) అని పలుకుటవలన మొదట చతుర్భుజాకారమును జూపి, ఆ పిమ్మట శాంతమగు మానవరూపమును ధరించియుండవచ్చును.

(2) దేవకీ దేవి యొక్క గర్భమున భగవానుడు జన్మించినప్పుడు శంఖచక్రాది చిహ్నములుండెనని, అది చాలా ప్రసన్నమైనరూపముగా నుండెనని అర్జునుడని యుండవచ్చును.

(3) విశ్వరూపదర్శనముచే శ్రీకృష్ణుడు సామాన్యులు కాదనియు, సాక్షాత్ విష్ణువే యనియు తెలిసికొనుటచే వైకుంఠమందట్టి చిహ్నములతోనే వారు సదా ప్రసన్న రూపులై వెలయుచుందురని ఎఱింగియుండుటవలన అర్జున డట్లు ప్రశ్నించి యుండవచ్చును.

**47. మయా ప్రసన్నేన తవార్జునేదం**
**రూపం పరం దర్శిత మాత్మయోగాత్**
**తేజోమయం విశ్వమనన్త మాద్యం**
**యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్.**

**వ్యాఖ్య:** 'మయా ప్రసన్నేన' అని చెప్పుట వలన అనన్యభక్తిగలవారియెడల భగవానుడు అనుగ్రహము జూపునని స్పష్టమగుచున్నది.

**48. న వేదయజ్ఞాధ్యయనైర్న దానై**
**ర్న చ క్రియాభిర్న తపోభిరుగ్రైః**
**ఏవం రూపశ్శక్య అహం నృలోకే**
**ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర**

**వ్యాఖ్య:** ఇచట తెలిపిన వేదాధ్యయన, యజ్ఞాదులచే భగవానుని విశ్వరూపమును జూడజాలరని చెప్పినంతమాత్రముచే అవియన్నియు నిరుపయోగములని అర్థము కాదు. ఆ క్రియలన్నిటిలో భక్తి కలియనిచోనవి యెక్కువ ఫలితము నొసంగజాలవని తెలుపుటయే యగును. ఎంత కృషిచేసినను జలములేనిచో సస్యములు ఫలింపవు గదా! అట్లే ఆ క్రియలున్ను.

**49. మాతే వ్యథా మా చ విమూఢభావో**
**దృష్ట్వా రూపం ఘోరమీదృఙ్మమేదమ్**
**వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం**
**తదేవ మే రూపమిదం ప్రపశ్య.**

**50. ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా**
**స్వకం రూపం దర్శయామాస భూయః**
**ఆశ్వాసయామాస చ భీతమేనం**
**భూత్వా పునస్సౌమ్యవపుర్మహాత్మా.**

**వ్యాఖ్య:** ఇచట రెండు పర్యాయములు "మఱల తనరూపమును జూపెను" అని చెప్పుట వలన మొదట అర్జునుని కోర్కెననుసరించి చతుర్భుజాకారముతో ప్రత్యక్షమై ఆ పిదప మఱల తన సౌమ్య మానవరూపమును జూపియుండవచ్చునని తోచుచున్నది.

**51. దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన**
**ఇదానీమస్మి సంవృత్తస్సచేతాః ప్రకృతిం గతః.**

**52. సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ**
**దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాఙ్క్షిణః**

**వ్యాఖ్య:** భగవంతుని స్వరూపమును సామాన్యులెవరును దర్శింపజాలరు. ఎంతయో హృదయనిర్మలత (చిత్తశుద్ధి), అనన్యభక్తిగలవారు మాత్రమే దానిని దర్శింపగలరు. కనుకనే 'దుర్దర్శనమ్' అనకుండ 'సుదుర్దర్శనమ్' అని చెప్పబడినది. భగవద్దర్శనము మహాదుర్లభమని భావము.

**53. నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా**
**శక్యం ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా.**

**వ్యాఖ్య:** 48వ శ్లోకమున తెలిపిన భావములనే మఱల తెలియజేయుచున్నారు. వేదాధ్యయన, తపో, దాన, యజ్ఞాదిక్రియలు పవిత్రములైనను నిర్మలభక్తి, అచంచల దైవ విశ్వాసము వానితో జోడింపబడినప్పుడు మాత్రమే అవి సత్ఫలముల నొసంగ గల్గును. (చూ - వ్యాఖ్య - 48 శ్లో) (ఈ విషయము రాబోవు శ్లోకమున తెలియజేయబడును).

**54. భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరన్తప.**

**వ్యాఖ్య:** క్రిందటి శ్లోకమున వేదపఠన యజ్ఞాదుల వలన భగవద్దర్శనము కాజాలదని చెప్పబడినది. మఱిదేనిచేత భగవద్దర్శనము కాగల్గునో ఈ శ్లోకమందు విపులముగ చెప్పబడినది. భగవత్సందర్శనమునకు అపాయము చెప్పబడిన శ్లోకమగుటచే ఇది అతి ముఖ్యమైనది. ముముక్షువు లిద్దానిని బాగుగ మననముచేసి అందలి భావము లను కార్యాన్విత మొనర్పవలెను.

- (తరువాయి వచ్చే సంచికలో)